నిరుద్యోగులకు బిఆర్‌ఎస్ 'ధోకా'!

- అమలుకు నోచుకోని గత ఎన్నికల హామీ
- ఐదేళ్లలోనూ ఇవ్వని 'నిరుద్యోగ భృతి'
- ఉద్యోగాల భర్తీ అంతంతే
- యువత ఆశలు ఆవిరి
- ఈసారి మహిళల ఓట్లకు వల
- సౌభాగ్యలక్ష్మి పేరుతో నెలకు రూ.3 వేల భృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ఒక్కొక్కరికీ నెలకు రూ.3,016 చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తాం.'అంటూ 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కెసిఆర్ హామీ ఇచ్చారు. అందుకనుగుణంగా ఆ పార్టీ మేనిఫెస్టోలోనూ పొందుపరిచింది. కానీ ఐదేండ్లలోనూ నిరుద్యోగ భృతిని బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయలేదు. వారికి బిఆర్ఎస్ ధోకా ఇచ్చిందన్న విమర్శలు వెల్లువెత్తాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిరుద్యోగ భృతి ఇస్తామంటూ నమ్మించి వారి ఓట్లతో అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత ఆ ఊసేలేదు. అయితే 'నిరుద్యోగ భృతి హామీ అమలుపై ఏం చేయాలో ఆలోచిస్తున్నాం. కరోనా వల్ల ఉద్యోగులకు జీతాలే ఇవ్వలేకపోయాం. నిరుద్యోగ భృతి ఇవ్వడానికి ఏం చేయాలో అది చేస్తాం. నిరుద్యోగులంటే ఎవరు?అన్నది ముందు తేల్చాలి. దానికి ప్రాతిపదిక ఏంటన్నది ఆలోచిస్తున్నాం.'అని 2021, మార్చి 17న ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు అసెంబ్లీలో ప్రకటించారు. 'నిరుద్యోగులకు తీపికబురు. అతిత్వరలోనే నిరుద్యోగ భృతి అమలవుతుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ దీనిపై ప్రకటిస్తారు'అని మంత్రి కేటీఆర్ అదే ఏడాది జనవరిలో చెప్పారు. ఆ ప్రకటనల ఆధారంగా 2023-24 రాష్ట్ర బడ్జెట్‌లో కచ్చితంగా నిరుద్యోగ భృతిని ప్రభుత్వం ప్రకటిస్తుందంటూ యువతీ, యువకులు ఎంతో ఆశగా ఎదురుచూశారు. అయితే బడ్జెట్‌లో ఆ ప్రస్తావన లేకపోవడంతో వారు తీవ్ర నిరాశ చెందారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పట్ల నిరుద్యోగులు వ్యతిరేకంగా ఉన్నారు. వారిని మచ్చిక చేసుకునేందుకు కేసీఆర్ బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో ఏదో ఒక హామీ ఇస్తారని అందరూ ఆశించారు. కానీ అందులోనూ వారి ఊసే ఎత్తలేదు. నిరుద్యోగులు, ఉద్యోగాల భర్తీ వంటి అంశాలే లేవు. దీంతో బీఆర్ఎస్ తీరు పట్ల నిరుద్యోగులు మరింత ఆగ్రహంతో ఉన్నారు. నిరుద్యోగులను బీఆర్ఎస్ పార్టీ మోసం చేసిందన్న అభిప్రాయం బలంగా ఉన్నది. అందుకే ఇప్పుడు నిరుద్యోగులు వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. నారాయణపేట జిల్లా గుండుమల్ మండల పరిధిలోని కొమ్మూరు గ్రామంలో నిరుద్యోగుల తల్లిదండ్రులను చైతన్యపరుస్తున్నారు. ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీకే ఓటు వేయాలంటూ అవగాహన కల్పిస్తుండడం గమనార్హం.

కొలువులు రాక ఆందోళన

ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యోగ నియామకాల్లో తెలంగాణ యువతకు అన్యాయం జరిగిందన్న పేరుతో ప్రత్యేక ఉద్యమం సాగింది. నీళ్లు, నిధులు, నియామకాలు అన్న లక్ష్యాల కోసమే పోరాటం చేశారు. ముఖ్యంగా విద్యార్థులు, నిరుద్యోగ యువకులు ఉద్యమంలో ముందు వరుసలో ఉన్నారు. ఆత్మహత్యలకు పాల్పడిన వారిలోనూ వారే అధికం. అయితే తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఉద్యోగాల కల్పన అంతంత మాత్రంగానే జరిగిందన్న అభిప్రాయం అందరిలోనూ ఉన్నది. దీంతో నిరుద్యోగుల ఆశలు, ఆకాంక్షలు పూర్తిస్థాయిలో నెరవేరలేదు. 2.24 లక్షల ఉద్యోగాలను భర్తీ చేశామని ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. లక్షకు మించి ఉద్యోగాల భర్తీ జరగలేదని పలు రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన సంఘాల నేతలు స్పష్టం చేస్తున్నారు. దీనిపై బహిరంగ చర్చకు రావాలంటూ అధికార పార్టీ నేతలకు సవాల్ విసురుతున్నారు. 80,039 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని సీఎం కేసీఆర్ అసెంబ్లీలో గతేడాది ప్రకటించారు. అందులో 35 వేల నుంచి 40 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. 16,604 పోస్టుల భర్తీకి పోలీసు నియామక బోర్డు, 9.210 పోస్టుల భర్తీకి గురుకుల బోర్డు ఆధ్వర్యంలో రాతపరీక్షలను నిర్వహించాయి. హైకోర్టు ఆదేశాలతో పోలీసు నియామకాల ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. ఇక తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ఉద్యోగాల భర్తీలో విఫలమై అభాసుపాలవుతున్నది. ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా గ్రూప్-1 ప్రిలిమ్స్ మొదటి సారి రద్దయ్యింది. ఆ తర్వాత నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో బయోమెట్రిక్ చేపట్టకపోవడం, ఓఎంఆర్‌లో అభ్యర్థుల వివరాలు పొందుపర్చకపోవడంతో హైకోర్టు మరోసారి రద్దు చేసింది. దీంతో అభ్యర్థులు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో గ్రూప్-2, డీఎస్సీ రాతపరీక్షలు వాయిదా పడ్డాయి. కారణమేదైనా తెలంగాణలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ సజావుగా సాగడం లేదు. దీంతో విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్ర మనస్తాపానికి, ఆందోళనకు గురవుతున్నారు. అందులో భాగంగానే హైదరాబాద్‌లో ప్రవళిక ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ సంఘటన రాజకీయంగా సంచలనం సృష్టించింది.

బిజెపి హామీ గాలిబుడగ

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ పాత్ర కూడా నిరుద్యోగం పెరగడంలో కీలకంగా ఉన్నది. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల కల్పన, మేకిన్ ఇండియా, స్కిల్ ఇండియా వంటివి గాలిబుడగలయ్యాయి. నిరుద్యోగ సమస్య పరిష్కారం కేంద్ర ప్రభుత్వ చేతుల్లోనే కీలకంగా ఉంటుంది. గ్రామీణ ఉపాధి హామీ చట్టం వంటి వాటిని కూడా నీరుగార్చడంతో గ్రామీణ, పట్టణ పేదరికం విస్ఫోటన స్థాయికి చేరింది. కానీ కేంద్రం తప్పులను పట్టించుకోకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం మీద బీజేపీ నాయకులు ఆరోపణలు చేయడం గమనార్హం. డబుల్ ఇంజిన్ సర్కార్ పేరుతో యువతను మోసం చేసేందుకు ఆ పార్టీ ముందుకొస్తున్నది. కేంద్రంలో ఆ పార్టీ అధికారంలో ఉన్నా నిరుద్యోగ సమస్యను పరిష్కరించడం లేదు. వివిధ రాష్ట్రాల్లోనూ ఉద్యోగాల కల్పన సరిగ్గా చేపట్టడం లేదు. కానీ తెలంగాణలో నిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామంటూ ఊదరగొట్టే ప్రసంగాలతో యువతకు గాలం వేయాలని కమలం పార్టీ చూస్తున్నది.

మహిళల ఓట్లే కీలకం...

రాష్ట్రంలో 3,17,32,727 మంది ఓటర్లున్నారు. వారిలో పురుషులు 1,58,71,493, మహిళలు 1,58,43,339 మంది ఉన్నారు. మహిళల కంటే పురుషులు 28,154 మంది అధికంగా ఉన్నారు. అయితే పురుషులతో సమానంగా మహిళల ఓట్లు ఉండడంతో రాజకీయ పార్టీలు వారికి వల వేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. వారి ఓట్లు పొందేందుకు మ్యానిఫెస్టోలో ఆకర్షణీయమైన పథకాలను పొందుపరుస్తున్నాయి. అధికారంలోకి వస్తే అమలు చేస్తామంటూ హామీలిస్తున్నాయి. ఈసారి మహిళలు కేంద్రంగా ఎన్నికలు జరిగే అవకాశమున్నది. అందుకే కాంగ్రెస్ పార్టీ మహాలక్ష్మి పేరుతో మహిళలకు ప్రతినెలా రూ.2,500 పెన్షన్, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, గృహజ్యోతి పేరుతో ప్రతి ఇంటికి 200 యూనిట్ల వరకు కరెంటు ఉచితమంటూ ప్రకటించింది. ఇక అధికార పార్టీ బీఆర్ఎస్ ప్రకటించిన మ్యానిఫెస్టోలో అర్హులైన మహిళలకు రూ.400కే గ్యాస్ సిలిండర్, సౌభాగ్యలక్ష్మి పథకం పేరుతో బీపీఎల్ కింద ఉన్న అర్హులైన పేద మహిళలకు నెలకు రూ.3 వేల భృతి ఇస్తామని హామీ ఇచ్చింది. అయితే మహిళలు ఏ పార్టీవైపు మొగ్గు చూపుతారో, ఎవరికి ఓటు వేస్తారో వేచిచూడాల్సిందే.ల

బిఆర్ఎస్ గెలుపును ఎవరూ అడ్డుకోలేరు

- కుటుంబపాలనకు కేరాఫ్ కాంగ్రెస్, బిజెపి : కోలేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో విపక్షాలు ఎంత దుష్ప్రచారం చేసినా బిఆర్ఎస్ గెలుపును ఎవరూ అడ్డుకోలేరని తెలంగాణ రాష్ట్ర పోలీసు గృహనిర్మాణ సంస్థ లిమిటెడ్ చైర్మన్ కోలేటి దామోదర్ తెలిపారు. కెసిఆర్ హ్యాట్రిక్ సిఎం ఖాయమని ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. కుటుంబ రాజకీయాలకు కేరాఫ్ కాంగ్రెస్, బిజెపిలేనని ఆరోపించారు. కెసిఆర్‌ది కుటుంబ పాలన అంటూ ఆ పార్టీలు చేస్తున్న విమర్శలు గురివింద సామెతను గుర్తు చేస్తున్నాయని తెలిపారు. కాంగ్రెస్, బిజెపిలోని కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, రాష్ట్రాల మంత్రులు, జాతీయ నేతలు, రాష్ట్ర నాయకుల వరకు వారి వంశవృక్షాలే కనిపిస్తాయని వివరించారు. కుటుంబపాలన గురించి ఆ పార్టీలు మాట్లాడ్డం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు.

IN THE COURT OF THE MACT CUM XXIV ADDL, CHIEF JUDGE : CITY CIVIL COURT, AT HYDERABAD
O.P.No. 2095 OF 2022

BETWEEN:
Gujjula Swamy Reddy.
...Petitioner.
AND
D.Raman and others.
...Respondents.

To,
Durke Raj Kumar S/o Durke Babu Rao, Age: Major, (As Per Policy) Owner of Pulsar bike bearing No. TS-08-GQ-8612, R/o : Vinaya Nagar, Malkajgiri, Medchal- Malkarjgiri District, Hyderabad, Telagnana State -500 047
...Respondent No.3

Please take notice that the petitioner has filed the above O.P. for claiming compensation for the injuries sustained by the petitioner in a road accident which was occurred on 26/09/2022 at 09:15 hours Near HP Petrol Bunk, Kompally, on NH-44 road by pulsar bike bearing No. TS-08-GQ-8612. The said O.P. is posted to 29.11.2023 at 10.30 AM for your appearance and counter. Kindly make it convenient to be present on the said date before this Hon'nle Court by 10.30 AM in person or through your counsel, failing which the matter will be decided on yousr absence.

Hence this notice.
BY ORDER OF THE COURT
M. VIJAY REDDY
ADVOCATE
2-2-647/A/58, Saibabanagar, Shivam Road, Bagh Amberpet, Hyderabad
PH. 7673904549, 9330489999

జూలూరు పథం..

- విప్లవ, సామాజిక, ప్రాంతీయ, అస్తిత్వ ఉద్యమ ఆత్మకథనాత్మక కావ్యం
- ఆంధ్రజ్యోతి సంపాదకులు కె శ్రీనివాస్

ప్రజాశక్తి -కల్చరల్

'జూలూరు పథం' సుదీర్ఘ కావ్యంలో ఆయన ఆత్మ కథనాత్మక కథ కనిపించినా తెలంగాణ గడ్డపై సాగిన విప్లవ ఉద్యమాలు, సామాజిక, అస్తిత్వ, ప్రాంతీయ భావాల నేపథ్యంలోనే కావ్యం సాగిందని ఆంధ్రజ్యోతి సంపాదకులు కె శ్రీనివాస్ అన్నారు. ముగింపు లేని వాక్యం, వొడవని ముచ్చటతో ముఖాముఖి సంభాషణగా 'జూలూరు పథం' కావ్యం సాగిందని తెలిపారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ప్రధాన వేదికపై సాహిత్య అకాడమీ అధ్యక్షులు జూలూరు గౌరీ శంకర్ దీర్ఘ కవితా సంపుటి 'జూలూరి పథం' పుస్తకావిష్కరణలో టిఎస్‌పిఎస్‌సి మాజీ చైర్మెన్ గంటా చక్రపాణి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్నతో కలిసి శ్రీనివాస్ ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ మీడియా అకాడెమీ చైర్మన్ అల్లం నారాయణ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. జూలూరు గౌరీశంకర్.. తన జీవిత నేపథ్యం చెబుతూనే సామాజికంగా తెలంగాణ పరిణామం చెందుతూ వచ్చిన విధానాన్ని డాక్యుమెంట్ విధానంలో అక్షరీకరించారని ప్రశంసించారు. కాలానికన్న ముందుకు దూసుకు వెళ్లాలని తపన, ఉత్తమ భావాలు కల గౌరీ శంకర్ తాను రాసే ప్రతి అంశంపై నిర్దిష్ట భావాలతో స్పష్టంగా ఉంటాయని వివరించారు. సాహిత్యంపై అవగాహన కార్య దక్షత వున్న గౌరీ శంకర్ సాహిత్య అకాడమీ అధ్యక్షత వహించి ఎన్నో సాహితీ విశేషాలకు మార్గం చేస్తున్నారన్నారు. అనంతరం అల్లం నారాయణ మాట్లాడుతూ.. తెలంగాణ కల్లోల దశాబ్దాల కాలం నుంచి స్వరాష్ట్రం సాకారమైన దశ దాకా వచ్చిన నేపథ్యంలో జూలూరు గౌరీశంకర్ దీర్ఘ కవిత సాగిందన్నారు. మార్పు వస్తుందని కలలు కన్నా నేడు బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు లభించిన వాటా తక్కువేనని, ఆశించిన సమానత్వం రాలేదని, జనాభాలో పది శాతం ఉన్నవారే రాజ్యం ఏలుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన దీర్ఘ కవిత అంతా వేదన, సంక్షోభం, సంఘర్షణ, ఆక్రోశం, కన్నీళ్లు, చైతన్యం మిళితమైన జీవన కావ్యం అని అభివర్ణించారు. గంటా చక్రపాణి మాట్లాడుతూ.. 'జూలూరు పథం' దాశరథి చెప్పినట్టు గాయపడిన కవి గుండెల్లో రాయబడని కావ్యంలా ఉందన్నారు. గోరటి వెంకన్న మాట్లాడుతూ.. మార్క్సిజం ఓడి పోదన్నారు. తెలంగాణ వాదాన్ని బలంగా నమ్మి వినిపించిన గౌరీ శంకర్.. తన కావ్య భాష అణగారిన వర్గాల వేదన అని చెప్పారు. ద్వేషం, హింస పెచ్చరిల్లిపోతున్న నేటి సమాజంలో గౌరీ శంకర్ వంటి వారి అవసరం ఎంతో ఉందని తెలిపారు. చివరగా గౌరీ శంకర్ తన కావ్య రచన నేపథ్యం వివరించారు

తుది దశకు హస్తం కసరత్తు

- 25న కాంగ్రెస్ రెండో జాబితా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ కాంగ్రెస్ అభ్యర్థుల రెండో జాబితా ప్రకటనపై స్క్రీనింగ్ కమిటీ కసరత్తు తుదిదశకు చేరినట్టు తెలుస్తోంది. వరుసగా రెండో రోజు ఆదివారం కూడా ఢిల్లీలో సమావేశమైన స్క్రీనింగ్ కమిటీ అభ్యర్థుల ఎంపికపై విస్తృతంగా చర్చించింది. మొదటి జాబితాలో 55 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్.. మిగిలిన 64 నియోజకవర్గాలకు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే 35 నుంచి 40 నియోజకవర్గాలకు అభ్యర్థులపై ఏకాభిప్రాయం కుదిరినట్టు తెలుస్తోంది. ఈ నెల 25న కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం కానుంది. అదే రోజున కాంగ్రెస్ రెండో జాబితా విడుదలయ్యే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. కాగా, వామపక్షాలతో కాంగ్రెస్‌కు పొత్తు కుదిరినా.. సీట్ల సర్దుబాటుపై పీటముడి వీడలేదని తెలుస్తోంది.

IN THE COURT OF THE HON'BLE XIX ADDL. SENIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT SECUNDERABAD
O.S No.23 of 2023

Between:
P. Madhavi alias K. Madhavi & another
...Plaintiffs
And
Smt. J. Rekha rep by AGPA holder K. Satyanarayana
...Defendant

To,
Smt. J. Rekha w/o J. Shivaji Yadav, Aged about 41 years, Occ: Employee, R/o Narayanguda, Hyderabad rep by her AGPA holder K. Satyanarayana S/o K. Butuchaiah, Aged about 68 years, Occ: Business, R/o H. No.1-8-702/81/1, New Nallakunta, Behind Shankermutt, Hyderabad.

Sir's/Madam,
Please take notice that the above suit in O.S No.23 of 2023 is filed before this Hon'ble Court by the plaintiffs against defendant herein and the same is coming up for your appearance and the same stands posted on 07.11.2023. Please make it convenient to present either in person or through your Counsel before the above Hon'ble court at 10.30 A.M on 07.11.2023, if you fail to appear on the above date the matter will be heard and decided as exparte.

(By order of the Court)
Sd/-
JAKKULA SRIDHAR
Advocate
Flat No.304, Opera Block A, Fortune Villa Road, Mahendra Hills, East Marredpally, Secunderabad

నోటీసు
మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, కందుకూరు.
O.S. No.23/2007
బొమ్మిశెట్టి ప్రసాదరావు మరియు ఇతరులు
- పిటీషనర్లు / వాదులు
మరియు
గుడపు రెడ్డి సావిత్రి మరియు ఇతరులు
- రెస్పాండెంట్లు
To : R2 తోట శ్రీనివాసరెడ్డి
R3 యర్రమరెడ్డి నరసారెడ్డి

పై నెంబరు దావాలో మిమ్మల్ని పార్టీలుగా చేర్చమని వాదులు పిటీషను దాఖలు చేయగా సదరు పిటీషనులో మీరు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీ నోటీసు నిమిత్త మై తేది: 01-11-2023 వ తేదీకి వాయిదా వేసియున్నారు. ఆ రోజున ఉదయం 10.30 ని॥లకు మీరు గాని, మీ తరపున న్యాయవాది గారు గాని పై వారి కోర్టులో హాజరై విచారణ జరిపించుకొనవలసినది. లేనిచో మీ పరోక్షమున కేసు తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

ఇట్లు: **వై.సాయిబాబు**
అడ్వకేట్, ఆంధ్రాబ్యాంకు, రాజాపానగల్‌రోడ్, ఒంగోలు. సెల్ : 98496 04168
ఒంగోలు
తేది : **20.10.2023**

వైద్యం వికటించి యువకుడు మృతి

- ఆదుకోవాలని రోడ్డుపై మృతదేహంతో రాస్తారోకో

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరితే వైద్య వికటించి చనిపోయాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. బాలిక కుటుంబాన్ని ఆదుకోవాలని ఆస్పత్రి ముందు రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. బాధిత కుటుంబ సభ్యులు, మృతుని భార్య ఎల్లమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం కొత్తకుంటపల్లికి చెందిన మల్లేష్ అనే చెంచు యువకుడు అనారోగ్యానికి గురికావడంతో ఆదివారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్చామన్నారు. వారు గ్లూకోస్, వ్యాక్సిన్ ఇచ్చారని, మధ్యాహ్నం పరిస్థితి విషమంగా ఉందని చెప్పి.. ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారన్నారు. ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు పరిశీలించి.. మృతిచెందినట్టు నిర్ధారణ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రజలకు సిఎం దసరా శుభాకాంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దసరా పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతిక జీవన విధానంలో దసరాకు ప్రత్యేక స్థానం ఉందని చెప్పారు. విజయానికి చిహ్నంగా దసరా పండుగను విజయదశమి పేరుతో దేశవ్యాప్తంగా జరుపుకుంటారని తెలిపారు. దసరా రోజున కుటుంబం లోని సభ్యులందరూ ఒకే చోట గుమికూడి సామూహికం గా సంబురాలు జరుపుకోవడం తెలంగాణ సబ్బండ వర్గాల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. శమిపూజ చేసి జమ్మి ఆకును బంగారంగా భావించి అలాయ్ బలాయ్ తీసుకోవడం.. పెద్దల ఆశీర్వాదం తీసుకోవడం శుభసూచకంగా భావించే పాలపిట్టను దర్శించుకోవడం తెలంగాణ ప్రాంతానికి ప్రత్యేకమని సిఎం అన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడేందుకు, అగ్రపథాన కొనసాగించేందుకు విజయ దశమి స్ఫూర్తితో అలుపెరుగని పోరాటం కొనసాగు తుందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణకు నిత్య విజయాలు కలిగేలా దుర్గామాత కృపాకటాక్షాలు ప్రజ లందరిపై ఉండాలని, ప్రజలందరికీ సుఖసంతోషాల ను ప్రసాదించాలని సిఎం కెసిఆర్ దుర్గామాతను ప్రార్థించారు.

తగ్గేదేలే..!

- మంత్రి, మాజీ మంత్రి మాటకు మాట
- పోటాపోటీగా విమర్శలు.. ప్రతివిమర్శలు
- పువ్వాడ, తుమ్మల పరస్పర ఆరోపణలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం నియోజకవర్గంలో మాటల యుద్ధం కొనసాగుతోంది. బిఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కాంగ్రెస్ అభ్యర్థిగా భావిస్తున్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. తనదైన శైలిలో పువ్వాడ విమర్శలు చేస్తుంటే...దానికి దీటుగా తుమ్మల ప్రతిస్పందిస్తున్నారు. మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి గత ఆదివారం తుమ్మల నిర్వహించిన స్ట్రింగ్ ఆపరేషన్ దగ్గర నుంచి మంత్రి అజయ్ నాలుకకు పదును పెట్టారు. అదే రీతిలో తుమ్మల కూడా కౌంటర్లు మొదలుపెట్టారు. ఇద్దరు కూడా రాష్ట్రవ్యాప్తంగా పేరున్న నేతలు కావడం, ఒకే సామాజిక తరగతికి చెందినవారు అవడంతో వీరి మాటలు రాష్ట్రవ్యాప్తంగానూ చర్చనీయాంశమ య్యాయి.

బందిపోట్ల దగ్గర మొదలు...

పొంగులేటి, తుమ్మల స్ట్రింగ్ ఆపరేషన్ సమయంలో పువ్వాడ హైదరాబాద్‌లో బీఫామ్ తీసుకునేందుకు వెళ్లారు. ఆ సమయంలో బందిపోట్లలా వచ్చి మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఓ నలుగురు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, ఇతర బీఆర్ఎస్ ముఖ్య నేతల ఇళ్లకు వెళ్లి వారిని కాంగ్రెస్‌లోకి స్వాగతించారు. అనంతరం వారిని తోడ్కొని హైదరాబాద్ వెళ్లి టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేర్పించారు. నాటి నుంచి మంత్రి మాటల యుద్ధానికి తెరదీశారు. ఓ బీఆర్ఎస్ నేత ఆత్మీయ సమ్మేళనంలో తుమ్మల, పొంగులేటిలను బందిపోట్లలా అభివర్ణించారు. కెసిఆర్ రాజకీయంగా అనేక అవకాశాలను వీరిద్దరికి ఇచ్చారని, అయినా తుమ్మల తాను ఓడిపోవడమే కాక మిగిలిన ఎనిమిదిమందిలో ఒక్కర్నీ గెలిపించలేదని, తాను ఒక్కడినే గెలిచానని పువ్వాడ చెప్పుకొచ్చారు. దీనిపై మాజీ మంత్రి, మాజీ ఎంపీ దీటుగా స్పందించారు. బందిపోట్లను తయారు చేసింది ఎవరని ప్రశ్నించారు. ఐదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఖమ్మంలో నెలకొన్న పరిస్థితులను తుమ్మల ఏకరువు పెట్టారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు ప్రజలు స్వేచ్ఛా, స్వాతంత్ర్యంతో జీవించారని వ్యాఖ్యానించారు. పువ్వాడ మంత్రిగా ఉన్న నాలుగున్నరేండ్లలో నెలకొన్న పరిస్థితులను వివరిస్తూ.. అవినీతి, అక్రమార్కులు, కబ్జాకోరులు రాజ్యమేలుతున్నారని ఆరోపించారు. వ్యాపారస్తులు, ఉద్యోగులు పైసా పైసా పోగేసుకుని కొనుగోలు చేసుకున్న ప్లాట్లు, స్థలాలకు భద్రత కరువైందన్నారు. మొత్తమ్మీద మంత్రి పువ్వాడ కాలంలో అశాంతి నెలకొందని తుమ్మల కౌంటర్ ఇచ్చారు. పువ్వాడ పాలనను రజకారు ఖాసీం రజ్వి పాలనతో పోల్చారు. ఈ వ్యాఖ్యలపై అజయ్ ఆదివారం మరోసారి స్పందించారు.

మరోసారి విరుచుకుపడిన మంత్రి..

పాలేరు నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని భావించిన తుమ్మల ప్రస్తుత రాజకీయ, సామాజిక సమీకరణాల దృష్ట్యా ఖమ్మం నియోజకవర్గానికి షిఫ్ట్ అయ్యారు. ఇక్కడ బిఆర్ఎస్ అభ్యర్థిగా ఉన్న పువ్వాడ నాటి నుంచి తుమ్మలపై విమర్శలకు తెరదీశారు. అజయ్ వ్యాఖ్యలకు తుమ్మల కౌంటర్ ఇస్తూనే.. మరికొన్ని వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం పువ్వాడ మరోసారి బీఆర్ఎస్‌కేవీ ఆటో యూనియన్ సమావేశంలో తుమ్మలపై విరుచుకుపడ్డారు. ఖమ్మంలో తుమ్మల ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న సమయంలో చేసిన రాజకీయ హత్యలు అన్నీఇన్నీ కావన్నారు. ఎందర్నో రాజకీయ సమాధి చేశారని వ్యాఖ్యానించారు. రౌడీయిజం, రౌడీషీటర్లను ప్రోత్సహించింది మీరు కాదా అని ప్రశ్నించారు. మంత్రి పదవి ఇచ్చిన ఎన్టీఆర్‌ను మోసం చేసి చంద్రబాబు దగ్గరకు వెళ్లావని, చంద్రబాబు దగ్గర మంత్రి పదవి పొంది.. ఆయన్ను మోసం చేసి కేసీఆర్ దగ్గరకు వచ్చి.. ఇక్కడా మంత్రి పదవి పొంది.. ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరావని విమర్శించారు. ఏదీ నీ నిజాయితీ, ఏదీ నీ నిబద్ధత, ఏదీ నీ నికార్సుతనం' అంటూ పువ్వాడ ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పాలనలో నగర ప్రజలు ప్రశాంతంగా, సంతోషంగా ఉన్నారని చెప్పుకొచ్చారు. ఈ మాటలయుద్ధం పువ్వాడ, తుమ్మలకు మాత్రమే పరిమితం కాకుండా ఇరుపార్టీల కార్పొరేటర్లు, బీఆర్ఎస్, కాంగ్రెస్‌లో నూతనంగా చేరిన నేతల వరకు కొనసాగుతోంది. ఎన్నికలు ముగిసే వరకు కూడా ఈ మాటల యుద్ధం ఆగకపోవచ్చని విమర్శకులు భావిస్తున్నారు.

కాంగ్రెస్ నుంచి బైటకు పంపేందుకు కుట్ర : విహెచ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ సీట్ల సర్దుబాటు విషయంలో పిసిసి మాజీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తీరుపై సీనియర్ నేత వి.హనుమంతరావు (విహెచ్) ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబర్‌పేట సీటు తాను సిఫారసు చేసిన వ్యక్తికి కాదని.. ఒబిసి చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్‌ను ఉత్తమ్ ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. శ్రీకాంత్‌గౌడ్ తనపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు పెట్టారని ధ్వజమెత్తారు. అంబర్‌పేట సీటు తాను లక్ష్మణ్ యాదవ్‌కు అడుగుతున్నానని, గతంలో అక్కడ యాదవ్‌లు గెలిచిన చరిత్ర ఉందన్నారు. గత ఎన్నికల్లో పొత్తుల్లో భాగంగా తనకు టికెట్ రాకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నుంచి తనను బయటకు పంపేందుకు ఉత్తమ్ కుట్ర చేస్తున్నారని విమర్శించారు. అంబర్‌పేట సీటు తనదని, తనకు దక్కకుండా చేస్తే.. తాను కూడా ఉత్తమ్ వెంట పడతానని హెచ్చరించారు.

PUBLIC NOTICE

This is to bring to the notice of the general public that my client or his nominees have intended to purchase the residential premises bearing No.30/13, PID No. 77-104-13, Municipal No.13, Kumar cot Layout, Bangalore-560001, (1st cross, Kumara Krupa Road), measuring 2960 sq.ft under the jurisdiction of BBMP, with all present and future superstructure thereon from Smt. Jayalaxmi Godavarthi w/o Srinivas Raju, D/o Late. Smt. Sheela Bai, R/at: Dalhousie 2D, Mythas Hill County, Bachpalli, Nizampet Road, Hyderabad -500090, Telangana State, which is morefully described in the schedule hereunder.

It is brought to the notice of the general public that any objections and claims of whatsoever nature for or against such purchase shall be addressed to the office of the counsel mentioned below within a period of **10 days** from the date of publication of this notice and in the absence of such objections and claims, my client will proceed to purchase the Schedule Property. Any such objections or claims received beyond the stipulated time from the day of this notice will not be either considered or deemed to have been a valid claim under law.

SCHEDULE PROPERTY

All that piece and parcel of land together with super structure, fittings and fixtures now standing thereon being the residential premises bearing No.30/13, PID No. 77-104-13, Municipal No.13, Kumar cot Layout, Bangalore-560 001, (1st Cross, Kumara Krupa Road), measuring 2960 sq.ft under the jurisdiction of BBMP, with all present and future superstructure thereon and is bounded on:

East by : 30 feet New Road; **West by :** Site No.31 and 42; **North by :** Site No.43; **South by :** Site No.29 in Division No.44.

ADDRESS FOR SERVICE :
Sri CHANDRASHEKHAR PATIL, ADVOCATE
No.4/5-1, I Floor, Crescent Road, High Grounds, Bengaluru - 560 001.
Mob: 98440 80113

IN THE COURT OF THE MACT CUM CHIEF JUDGE: CITY CIVIL COURT AT HYDERABAD
O.P.No. 2089 OF 2021

BETWEEN:
M. Alivelu and others.
...Petitioners.
AND
M.Sheebharani and others.
...Respondents.

To,
1) M.sheebharani W/o. Jayanandam, aged major, Occ: Owner of Passion Pro Motor cycle bearing No. TS 05FA 6405, R/o. 9-115, Angadipeta, pedda adisherlapally, Nalgonda District, Telangana State.
...Respondent No.1
3) Satish Maddimadugu, S/o, Krupaiah, aged major, Occ:Rider of motor cycle No. TS 05FA 6405, R/o. Angadipeta village, Pedda Adisherlapally, Nalgonda District.
...Respondent No.3.

Please take notice that the petitioners have filed the above O.P. for claiming compensation for the death of Mada Mallesham who died in a road accident which was occurred on 28-06-2021 at about 05:30 PM near Government Gurukula School in the outskirts of Angadipeta X road, Pedda Adiserla Palle by motor cycle bearing No. TS-05-FA-6405. The said O.P is posted to 01.12.2023 at 10.30 AM for your appearance and counter. Kindly make it convenient to be present on the said date before this Hon'ble Court by 10.30 AM in person or through your counsel, failing which the matter the matter will be decided on your absence.

Hence this notice
BY ORDER OF THE COURT
M.VIJAY REDDY
ADVOCATE
2-2-647/A/58, Saibabanagar, Shivam Road, Bagh Amberpet, Hyderabad
PH:7673904549, 9330489999

మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుపై విచారణ

- అంతర్రాష్ట్ర సరిహద్దును మూసివేసిన అధికారులు
- నెలరోజుల్లో మరమ్మతులు పూర్తిచేస్తాం : ఇఎన్‌సి వెంకటేశ్వర్లు
- టెక్నికల్ వైఫల్యం కనిపిస్తోంది : ఎమ్మెల్యే శ్రీధర్ బాబు
- కెసిఆర్ ప్రభుత్వం బాధ్యత వహించాలి : ఈటల రాజేందర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీ కుంగిపోవడంపై నిపుణుల బృందం పరిశీలిస్తోంది. ఆదివారం ఉదయం ఇంజనీరింగ్ అధికారులు కుంగిన 19, 20, 21 బ్యారేజీ పిల్లర్లను పరిశీలించారు. అనంతరం ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. నిర్మాణ లోపమా.. మరేదైనా కారణం ఉందా అన్న కోణంలో విశ్లేషిస్తున్నారు. మరోపక్క బ్రిడ్జి కుంగిపోవడంతో జయ శంకర్ భూపాలపల్లి జిల్లాకు మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లాకు రాకపోకలు నిలిచిపోయాయి. పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేసి అంతర్రాష్ట్ర సరిహద్దును మూసివేశారు. ప్రజా ప్రతినిధులు, రాజకీయ నేతలు ఎవరూ రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. నాడు అద్భుతమైన కాళేశ్వరం ప్రాజెక్టును చూసి తనివి తీరాల్సిందేనని ప్రచారం చేసిన సర్కార్.. నేడు, నిర్మాణంలో లోపాలు బహిర్గతమైతే ఎందుకు చూడనివ్వడం లేదని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. కాగా, శనివారం రాత్రి వరకు బ్యారేజీలో దాదాపు పది టిఎంసిల నీళ్లు ఉండగా.. ఇరిగేషన్ అధికారులు గేట్లు ఎత్తి నీటికి ఖాళీ చేయడం ప్రారంభించారు. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులో మొదటి బ్యారేజీ మేడిగడ్డ బ్యారేజీని 1,632 మీటర్ల పొడువున నిర్మించారు. 85 గేట్లతో 16 టీఎంసీ నీటి సామర్థ్యంతో నిర్మించారు. మేడిగడ్డ బ్యారేజీకి ఎలాంటి ప్రమాదం లేదని, నెలరోజుల్లో మరమ్మతులు పూర్తిచేస్తామని రామగుండం ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు తెలిపారు. బ్యారేజీ కుంగిపోయిన నేపథ్యంలో ఆదివారం రాత్రి మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించిన అనంతరం మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. బ్యారేజీకి ఎలాంటి ప్రమాదం లేదని, శనివారం రాత్రి పెద్ద శబ్దం రావడంతో విషయం తెలుసుకొని పరిశీలించామన్నారు. అధికారులకు సమా చారం అందించడంతో వారూ వచ్చి పరిశీలించారని తెలిపారు. బ్యారేజీ కుంగుబాటు తర్వాత నీటిని దిగువకు విడుదల చేశామని, త్వరలోనే మరమ్మతులు పూర్తిచేస్తా మన్నారు. ప్రజల రక్షణను దృష్టిలో ఉంచుకొని, ఎవరినీ బ్యారేజీ పరిసరాల్లోకి అనుమతించడం లేదని తెలిపారు. ఈ ప్రాజెక్టు నుంచి గతేడాది 28 లక్షల క్యూసెక్కుల నీటిని ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా దిగువకు విడుదల చేశామని గుర్తుచేశారు. చిన్నచిన్న సమస్యలుంటే పరిశీలించి పరిష్కరిస్తామని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందొద్దన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ లక్ష్మి బ్యారేజీ కుంగుపాటుకు మానవ తప్పిదాలు, టెక్నికల్ వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని, ఈ ఘటనకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఎమ్మెల్యే శ్రీధర్ బాబు డిమాండ్ చేశారు. శనివారం రాత్రి

బ్రిడ్జి కుంగిన విషయం తెలుసుకున్న శ్రీధర్‌బాబు, రైతుసంఘం కరీంనగర్ జిల్లా కార్యదర్శి వి వెంకట్‌రెడ్డి బ్యారేజీ సందర్శనకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దాంతో వారు అక్కడే బైటాయించి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులతో శ్రీధర్ బాబు వాదనకు దిగారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టులో నాణ్యతాలోపం బహిర్గతమవుతుందన్న భయంతోనే ప్రభుత్వం పోలీసులను పెట్టి విపక్ష నేతలను సందర్శించకుండా అడ్డుకుం టుందని ఆరోపించారు. బ్యారేజీ మూడో బ్లాక్‌లోని పిల్లర్లు కుంగిపోవడంతో.. కాళేశ్వరం ప్రాజెక్టులో మానవ తప్పిదాలు, టెక్నికల్ వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తు న్నాయని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు అన్నారు. కిలోమీటరున్నర దూరం నుంచి చూసినా బ్యారేజీ కుంగినట్టు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. అదే విషయాన్ని డీఈలు కూడా నిర్ధారించి చెప్పారని, ఇతర రాష్ట్రాల నుంచి నిపుణులను పిలిపిస్తున్నట్టు చెప్పారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఏవిధంగా కట్టారో.. ఏవిధంగా కుంగి పోతోందో.. ప్రజలందరికీ చూపించాలని డిమాండ్ చేశారు.

తానే స్వయంగా ఇంజనీరింగ్ బాధ్యత వహిస్తూ ఒక ఇంజనీర్‌లా పనిచేశానన్న కెసిఆర్ నేడు ఏం సమాధానం చెప్తారని బిజెపి నేత ఈటల రాజేందర్ సిఎం కెసిఆర్‌ను ప్రశ్నించారు. మేడిగడ్డ బ్యారేజీ ప్రాంతాన్ని సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల చెమట డబ్బుల తో కట్టిన ప్రాజెక్టులతో.. రైతాంగానికి నీరందు తుందను కున్నామని, కానీ కన్నీళ్లు పెట్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బ్యారేజ్ పంపులు మునిగి భారీ నష్టం వాటిల్లిందని, నేడు ప్రాజెక్టు కుంగడంతో రైతులకు ఎలా నీరందిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రజలకు పూర్తి సమా చారాన్ని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

కెసిఆర్ ఏ ఒక్క హామీ నిలబెట్టుకోలేదు

- కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పాలనలోనే దేశాభివృద్ధి జరిగిందని కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి అన్నారు. 1995 నాటికే ఐదు లక్షల గ్రామాలకు కాంగ్రెస్ విద్యుత్ ఇచ్చిందని తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం కాంగ్రెస్ నాయకులే పోరాడారన్న ఆయన.. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కూడా కాంగ్రెస్ పార్టీయేనని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జానారెడ్డి మాట్లాడారు. పార్టీకి నష్టం జరుగుతుందని తెలిసీ తెలంగాణ ఇచ్చామన్నారు." తెలంగాణ రాష్ట్రం కోసం మేం పదవులూ కోల్పోయాం. ఉపాధి హామీ, ఆహారభద్రత, సమాచార హక్కు చట్టాలు తెచ్చింది కాంగ్రెస్ కాదా? ఉచిత విద్యుత్, రూపాయికి కిలో బియ్యం ఇచ్చింది కాంగ్రెస్సే. సిఎం కెసిఆర్ ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేదు. రూ.లక్ష రుణమాఫీ ఇప్పటికీ పూర్తి చేయలేదు. తొలివిడతలో రుణమాఫీకి ఐదేళ్లు పట్టడంతో రైతులపై వడ్డీ భారం పడింది. రెండో విడత రుణమాఫీని అసలు పూర్తి చేయలేదు." అని జానారెడ్డి విమర్శించారు.

'కారు'కే ఆధిక్యం

- మిషన్ చాణక్య సర్వేలో వెల్లడి
- కర్ణాటక, మునుగోడులో మా అంచనా తప్పింది
- ఆ సంస్థ ఛైర్మన్ ఎ శివకేశవ్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

ఇప్పటి వరకు ప్రజల ఎన్నికల నాడిని పరిశీలిస్తే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకే అధిక్యం వస్తుందని తమ సర్వేలో వెల్లడైనట్టు మిషన్ చాణక్య వ్యవస్థాపక ఛైర్మెన్ ఎ శివకేశవ్ తెలిపారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్‌కు 70 నుంచి 76 సీట్లలో విజయం సాధిస్తుందని, కాంగ్రెస్ కేవలం 25 సీట్లు మాత్రమే గెలుస్తుందని తమ సర్వేలో వెల్లడైందన్నారు. బిజెపి కేవలం తొమ్మిది చోట్ల మాత్రమే విజయం సాధించే అవకాశం ఉందన్నారు. ఆదివారంనాడిక్కడి ప్రెస్‌క్లబ్‌లో తాము నిర్వహించిన సర్వే ఫలితాలను ఆయన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వెల్లడించారు. కర్ణాటక ఎన్నికల తర్వాతి నుంచి మొత్తం 14 లక్షల మంది ఓటర్ల అభిప్రాయాలను తాము సేకరించి, 'నా రాష్ట్రం-నా ఓటు-నా నిర్ణయం' పేరుతో విశ్లేషించామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు 44.62 శాతం, కాంగ్రెస్‌కు 32.71 శాతం, బిజెపికి 17.6 శాతం ఓట్లు వస్తాయని అంచనా వేశామన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బిజెపి హవా తగ్గి, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్‌లో పెరిగిందని చెప్పారు. అయితే అన్ని పార్టీల అభ్యర్థులు ఖరారయ్యాక ఈ అంచనాల్లో తేడాలు ఉంటాయన్నారు. అభ్యర్థుల ఖరారు తర్వాత 'పొలిటికల్ ట్రెండ్' ప్రకటిస్తామని, పోలింగ్ ముగిసాక ఎగ్జిట్ పోల్స్ వెల్లడిస్తామని తెలిపారు. కర్ణాటకలో బిజెపి అధికారంలోకి వస్తుందని తమ సర్వేలో వెల్లడైందనీ, కానీ అందుకు భిన్నంగా అక్కడ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. అలాగే మునుగోడు ఉప ఎన్నికలోనూ బిజెపి అభ్యర్థి గెలుస్తారని సర్వే ఫలితాలు ప్రకటించామనీ, కానీ అందుకు భిన్నంగా బిఆర్ఎస్ అభ్యర్థి అక్కడ విజయం సాధించారని వివరించారు. కర్ణాటక, మునుగోడు ఎన్నికల్లో తమ సర్వే ఫెయిల్ అయినా, 2018నాటి సర్వే సక్సెస్ అయ్యిందంటూ విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానంగా చెప్పి, సమర్థించుకున్నారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 28 శాతం ఓటింగ్ ఉండగా, ఇప్పుడది 33 శాతానికి పెరిగిందన్నారు. కర్నాటక ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రంలో బిజెపికి అంత సీన్ లేదని తెలిసాక, రాష్ట్ర ఓటరు నాడి కాంగ్రెస్‌వైపు మళ్లిందని, అందుకే బబిఆర్ఎస్ ఓటింగ్ శాతం తగ్గి, కాంగ్రెస్‌కు పెరిగిందని విశ్లేషించారు.

కీం.. కర్తవ్యం ?

- బాబు బయటకొస్తేనే తెలంగాణ టిడిపికి మోక్షం
- మరోసారి ములాఖత్‌కు కాసాని
- అభ్యర్థుల ప్రకటన మరింత ఆలస్యం

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

తెలుగుదేశం తెలంగాణ శాఖలో నెలకొన్న గందరగోళ పరిస్థితికి తెరపడటానికి మరికొన్ని రోజులు పట్టేలా కనిపిస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వచ్చి దాదాపు రెండు వారాలు దాటింది. ఆశావహులైన నేతలు టికెట్ల కోసం ఎదురుతెన్నులు పడుతున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ఎపి రాజకీయ పరిస్థితుల కారణంగా రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్నారు. ఈనేపథ్యంలో తెలంగాణలో టిడిపి పరిస్థితి ముందు నుయ్యి..వెనుక గొయ్యిలా తయారైంది. ఎన్నికల్లో పోటీచేసేందుకు కావాల్సిన భీఫారాల కోసం పార్టీ తెలంగాణ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్‌పై ఒత్తిడి పెరుగుతున్నది. ఆదివారం సైతం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్ ఆశావహులైన నేతలు, కార్యకర్తలతో నిండిపోయింది. ప్రస్తుత పరిస్థితిని చర్చించి నిర్ణయాలు తీసుకునేందుకు ముఖ్యమైన నాయకులతో కాసాని ప్రత్యేక సమావేశాన్ని సైతం ఏర్పాటు చేశారు. నాలుగైదు రోజుల్లో చంద్రబాబును మరోసారి ములాఖాత్‌లో కలిసేందుకు కాసాని ప్రయత్నిస్తున్నారు. బుధ, గురువారాల్లో ఈ సమావేశం ఉండొచ్చని స్వయంగా ఆయనే చెప్పడం గమనార్హం. ములాఖాత్ విషయమై ఏపీ నేతలతో మాట్లాడారు. తెలంగాణ రాజకీయాలు, పొత్తు అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకునేందుకు పావులు కదుపుతున్నారు. ములాఖాత్‌కు వెళ్లేటప్పుడు తెలంగాణలో పోటీచేసే అభ్యర్థుల జాబితాను సైతం తీసుకెళ్లీ ఆమోదముద్ర వేయించుకోవాలని కాసాని భావిస్తున్నారు. ఇందుకోసం అవసరమైతే మూడు, నాలుగు రోజులు రాజమండ్రిలోనే ఉండాలని నిర్ణయించుకున్నారు.

102 కిలోల గంజాయి పట్టివేత

- ముగ్గురు నిందితులకు రిమాండ్, ఇద్దరు పరారీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అక్రమంగా గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను ఆదివారం ఎస్ఓటి, శంషాబాద్ పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి 102 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అరెస్టు చేయగా, ఇద్దరు పరారీలో ఉన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ జోన్ డిసిపి కె నారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లాకు చెందిన అపూర్ బిశ్వాస్, భాసుదేబ్ హల్దర్, రాబిన్ మండల్, అర్జున్ ముదిలి, బెంగళూరుకు చెందిన ఫిరోజ్.. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో వీరంతా ఓ ముఠాగా ఏర్పడి గంజాయి అక్రమ రవాణా చేస్తున్నారు. వీరు మల్కాన్‌గిరి జిల్లాలోని గ్రామాల నుంచి గంజాయి సేకరించి బెంగళూరుకు.. స్కార్పియో కారులో తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో శంషాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీం పోలీసులు నేషనల్ హైవే ఫాల్మాకు వద్ద నిఘా పెట్టారు. కాగా, ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా శంషాబాద్ మండలం పాలమాకుల నేషనల్ హైవే-44 వద్ద పోలీసులు వాహనాన్ని అడ్డుకొని తనిఖీ చేశారు. అందులో రెండు కిలోల బరువున్న 52 గంజాయి ప్యాకెట్లను గుర్తించారు.

అక్రమ గంజాయి, పోలీసులకు చిక్కిన అంతర్రాష్ట్ర ముఠా

గంజాయి, వాహనం, ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.29లక్షలు ఉంటుందని అంచనా. ఐదు మంది నిందితుల్లో ప్రధాన నిందితుడు అపూర్ బిశ్వాస్‌తో పాటు భాసుదేబ్ హల్దర్, రాబిన్ మండల్‌ను అరెస్ట్ చేశారు. అర్జున్ ముదిలి, ఫిరోజ్ పరారీలో ఉన్నారు. నిందితులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. ఈ ఆపరేషన్‌లో ఎస్ఓటి డిసిపి ఎంఎ రషీద్, అడిషనల్ ఎస్ఓటి పి నారాయణ, ఆర్‌జిఐఎ పిఎస్ ఎసిపి రామచందర్ రావు, శంషాబాద్ పిఎస్ ఎస్‌హెచ్ఒ ఎ శ్రీధర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణకు చల్లటి కబురు

- రెండ్రోజుల్లో ఈశాన్య రుతుపవనాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నైరుతి రుతుపవనాల తిరోగమనంతో వర్షాలు ముఖం చాటేశాయి. దీంతో జనం ఎండకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ క్రమంలో వాతావరణశాఖ ఆదివారం తీపి కబురు చెప్పింది. దేశంలో ఇప్పటికే ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించాయి. దీంతో పలు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తున్నాయి. రాగల రెండ్రోజుల్లో తెలంగాణపై ఈశాన్య రుతుపవనాల ప్రభావం చూపే అవకాశం ఉందని అంచనా వేసింది.ఇదిలా ఉండగా.. మధ్య బంగాళాఖాతంలో ఆగ్నేయ బంగాళాఖాతానికి ఆనుకొని ఉన్న ప్రాంతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతుందని భారత వాతావరణశాఖ పేర్కొంది. వాయవ్య దిశగా ప్రయాణిస్తు.. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని తెలిపింది. వాయుగుండంగా మారాక ఉత్తర ఈశాన్య దిశగా కదులుతూ బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ తీరం వైపు ప్రయాణించే అవకాశం ఉందని పేర్కొంది. దీంతో ఈ నెల 24, 25 తేదీల్లో కోస్తాంధ్ర, రాయలసీమలోని ఒకటిరెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే సూచనలున్నాయని, తీరం వెంట గంటకు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది. వాయుగుండం తుఫానుగా మారే అవకాశాలున్నాయని చెప్పింది.

'జూరాల' వ్యర్థాల ట్యాంకర్లను అడ్డుకున్న గ్రామస్తులు

- వ్యర్థాలతో పంటలు, చెరువుల్లోని నీరు కలుషితం
- ఆందోళనకారులపై లాఠీఛార్జి
- ఆగ్రహంతో పోలీసుల వాహనాలు ధ్వంసం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూర్ వద్దనున్న జూరాల ఆగ్రో ఇథనాల్ కంపెనీ వద్ద ఉద్రిక్తత నెలకొంది. కంపెనీ కెమికల్ వ్యర్థాలను చిత్తనూర్ గ్రామ సమీపంలోని వాగులో పారబోసేందుకు ట్యాంకర్ ద్వారా తరలిస్తుండగా.. ఆ వాహనాలను ఏక్లాస్‌పూర్, చిత్తనూరు, జిన్నారం, కనుమనూరు గ్రామస్తులు అడ్డుకొని ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని వారిపై లాఠీచార్జికి దిగారు. దాంతో గ్రామస్తులు కట్టెలు, రాళ్లతో పోలీసులపైకి తిరగబడ్డారు. వాహనాలకు నిప్పుపెట్టారు. ఈ దాడుల్లో మక్తల్ సిఐ రామ్‌లాల్‌తో పాటు గ్రామస్తులకు గాయలయ్యాయి. ఆందోళనకారులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

చిత్తనూర్ గ్రామానికి సమీపంలోని జూరాల ఆగ్రో ఇథనాల్ ఫ్యాక్టరీలోని వ్యర్థాలను శుద్ధి చేసే ప్లాంట్ ఏర్పాటు చేయకుండా తమ గ్రామాల సమీపంలోని వాగులు, ఖాళీ స్థలాల్లో వేస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో తమ పంటలు, చెరువుల్లోని నీరు కలుషితం అవుతుందన్నారు. ఈ ఫ్యాక్టరీ ఏర్పాటునూ తాము వ్యతిరేకించామని తెలిపారు. కాగా, చిత్తనూరు సమీపంలో

గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

ఫ్యాక్టరీ వ్యర్థాలను డంప్ చేసేందుకు వచ్చిన ట్యాంకర్‌ను గ్రామస్తులు అడ్డుకొని పరిశ్రమ వ్యర్థాలను గ్రామ సమీపం లోని వాగులో వేయొద్దని కోరారు. అడ్డుకున్న విషయం తెలుసుకున్న పోలీసులు, తహసీల్దార్ సునీత ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఆందోళనకారులు, తహసీల్దార్, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. గ్రామస్తులను చెదరగొట్టేందుకు నారాయణపేట డిఎస్‌పి లాఠీచార్జికి అనుమతించారు. ఆగ్రహించిన గ్రామస్తులు.. పోలీసులపై రాళ్లు, కర్రలతో దాడిచేశారు. పోలీస్ వెహికల్‌కు నిప్పు పెట్టారు. ఈ దాడిలో మక్తల్ సిఐ రాంలాల్‌కు తీవ్రగాయాలవగా.. మహబూబ్ నగర్‌లోని నవోదయ ఆస్పత్రికి తరలించారు.

గాయాలైన మరికొంతమంది గ్రామస్తులు, పోలీసులను నారాయణపేట, మహబూబ్‌నగర్ ప్రభుత్వాస్పత్రులకు తరలించారు. కాగా, ఫ్యాక్టరీ యాజమాన్యానికి పోలీసులు, అధికారులు వత్తాసు పలుకుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వ్యర్థాలు డంప్ చేస్తున్నారని చెబితే తమపై పోలీసులు అన్యాయంగా లాఠీచార్జి చేశారని, మహిళలపైనా దాడి చేశారని తెలిపారు. చిత్తనూరులో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అదనపు బలగాలను రప్పించి బందోబస్తు నిర్వహిస్తున్నారు.

కార్మికులకు మేలు చేసే అంశాలను మ్యానిఫెస్టోలో చేర్చండి

- మంత్రి కెటిఆర్‌కు ఉద్యోగ, కార్మిక సంఘాల వినతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోని కార్మిక, ఉద్యోగ సంఘాలు సంయుక్తంగా రూపొందించిన వర్కర్స్ మ్యానిఫెస్టోలో అంశాలను పరిగణనలోకి తీసుకోవాలనీ, కార్మికులకు మేలు చేసే అంశాలను అధికార పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపర్చాలని మంత్రి, బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారకరామారావును కోరారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో మంత్రికి వినతిపత్రాన్ని, వర్కర్స్ మ్యానిఫెస్టోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బా రామారావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సూర్యం, టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎంకె బోసు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు. రాష్ట్రంలో పదేండ్లుగా కార్మికులు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సమ్మెలు, ఉద్యమాలు చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అందుకే ఈసారి మ్యానిఫెస్టోలో కార్మికుల అంశాలను చేర్చాలని డిమాండ్ చేశారు. కోటి మందికిపైగా కార్మికులు, ఉద్యోగుల న్యాయమైన సమస్యలను తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ, కార్మిక సంఘాలు ఉమ్మడిగా చర్చించి వర్కర్స్ మ్యానిఫెస్టోను రూపొందించాయ న్నారు. దీనిని పలు పార్టీల అధ్యక్షులకు అందజేస్తున్నామన్నారు. రాష్ట్రంలో కోటి మందికి ప్రయోజనం కల్గించే 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్ కనీస వేతనాలను సవరించాలనీ, కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌ల రద్దు, కాంట్రాక్టు-ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు, పరిష్కారాలు, పాత పెన్షన్ పునరుద్ధరణ, మెడిసిన్‌పై జిఎస్‌టి ఎత్తేసి ధరలు తగ్గించడం, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు, స్థానిక సంస్థల్లో పనిచేసే మున్సిపల్, గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యల పరిష్కారం, ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లలో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను మ్యానిఫెస్టోలో పొందుపర్చామని తెలిపారు. వాటన్నింటిపైనా పార్టీలు తమ వైఖరిని స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

వరంగల్ జిల్లాలో రోడ్డు ప్రమాదం

- తండ్రి, కుమార్తె మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పండుగ పూట విషాదం నెలకొంది. దసరాకు అత్తారింటి నుంచి కూతురు, అల్లుణ్ని తండ్రి బైక్‌పై తీసుకెళ్తున్న క్రమంలో ఓ కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తండ్రీకుమార్తె అక్కడికక్కడే దుర్మరణం చెందారు. అల్లుడు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మొరిపిరాలకు చెందిన వెంకన్న కుమార్తె అనూష, అల్లుడు రాజేశ్‌ను ఇంటికి పిలిచి దసరా పండుగను చేసుకోవాలని అనుకున్నారు. శనివారం సాయంత్రం అనూష ఇంటికి వెళ్లి కూతురు, అల్లుణ్ని వెంటబెట్టుకుని రాత్రి సమయంలో బైక్‌పై బయల్దేరారు. అ క్రమంలో కిష్టాపురం సమీపానికి రాగానే వాళ్ల బైక్‌ను ఓ కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకన్న, అనూష అక్కడికక్కడే మృతి చెందారు. రాజేశ్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు రాజేశ్‌ను హుటాహుటిన దవాఖానకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చిట్యాలలో చెట్టును ఢీకొట్టిన ప్రయివేట్ బస్సు..

నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద అదుపుతప్పిన ప్రయివేటు ట్రావెల్స్ బస్సు రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో బస్సు డ్రైవర్, క్లీనర్ తీవ్రంగా గాయపడ్డారు. బస్సులో ఉన్న ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. డ్రైవర్, క్లీనర్ పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు.హైదరాబాద్ నుంచి గుంటూరు వెళు తుండగా ప్రమాదం జరిగిందని తెలిపారు. ప్రమాద సమయంలో బస్సులో 40 మంది ఉన్నారని వెల్లడించారు. డ్రైవర్ నిద్రమత్తు వల్లే ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదుచేశామని, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బిఆర్ఎస్ 'సోషల్ వార్...'

- పోల్ మేనేజ్‌మెంట్ కోసం కసరత్తులు
- వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విటర్ ద్వారా విస్తృత ప్రచారం
- ఒక్కో గ్రామంలో వంద మందితో బూత్ కమిటీ ఏర్పాటు
- అన్ని విషయాల్లోనూ తాజా సమాచారంతో సిద్ధంగా ఉండండి
- నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌ల సమావేశంలో మంత్రులు కెటిఆర్, హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రస్తుత ఎన్నికల్లో సామాజిక మాధ్యమాలను నూటికి నూరు శాతం వాడుకోవాలని బిఆర్ఎస్ నిర్ణయించింది. తొమ్మిదిన్నరేండ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విటర్ తదితర వేదికల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని క్షేత్రస్థాయి కార్యకర్తలకు పిలుపునిచ్చింది. ఇదే సమయంలో ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో వార్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. వాటిని రాష్ట్ర కేంద్రంలోని 'వార్ రూమ్'కు అనుసంధానం చేసింది. ప్రతీ గ్రామంలోనూ వంద మందితో బూత్ కమిటీలను ఏర్పాటు చేయడం ద్వారా పోల్ మేనేజ్‌మెంట్‌ను పక్కాగా అమలు చేయాలంటూ పార్టీ నేతలను ఆదేశించింది. ఆదివారం హైదరాబాద్‌లోని జల విహార్‌లో బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌ల సమావేశం జరిగింది. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌తోపాటు మంత్రి హరీశ్‌రావు ఈ కార్యక్రమానికి హాజరై ఆయా బాధ్యులకు దిశా నిర్దేశం చేశారు.

నియోజకవర్గాల సమాచారం, ప్రచారం, ప్రతిపక్షాల విమర్శలు తదితరాంశాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా రాష్ట్ర కేంద్రానికి తెలపాలంటూ వారు ఆదేశించారు. ముఖ్యంగా ఇటీవల ప్రకటించిన బిఆర్ఎస్ మేనిఫెస్టోను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోవాలని సూచించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను బిఆర్ఎస్ కాపీ కొట్టిందంటూ కొనసాగుతున్న ప్రచారాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా తిప్పి కొట్టాలని కోరారు. పార్టీలోని సీనియర్లు, అనుభవంగల వారు సోషల్ మీడియాను వాడుకోవటంలో వెనుకబడి ఉంటున్నారని తెలిపారు. వారందరూ మారుతున్న కాలంతోపాటు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు. సభలు, సమావేశాలు, ఇతరత్రా కార్యక్రమాల్లో కారు గుర్తును సూచించే ఫ్లెక్సీలు, బొమ్మలను విధిగా ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల మీటింగుల్లో పాల్గొనే నేతలందరూ విధిగా తమ చొక్కాపై కారు గుర్తు ఉండే విధంగా చూసుకోవాలని ఆదేశించారు.

వారి వద్ద సంస్కారం నేర్చుకోవాల్సిన పని లేదు : కెటిఆర్

బిఆర్ఎస్ నేతలు సంస్కారం నేర్చుకోవాలంటూ కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి వ్యాఖ్యానించటాన్ని మంత్రి కెటిఆర్ ఈ సందర్భంగా తప్పుబట్టారు. వారి వద్ద సంస్కారం నేర్చుకోవాల్సిన అగత్యం తమకు పట్టలేదన్నారు. గతంలో కెసిఆర్‌కు పిండం పెట్టాలి, ఆయన్ను రాళ్లతో కొట్టాలంటూ మాట్లాడిన పిసిసి చీఫ్ రేవంత్‌కు ముందు సంస్కారం నేర్పండంటూ జానాకు సూచించారు. రూ.50 కోట్లకు పిసిసి అధ్యక్ష పీఠాన్ని అమ్ముకున్నారంటూ ఘాటుగా విమర్శించారు. సీట్ల పంపకాల నేపథ్యంలో రేవంత్ డబ్బులు వసూలు చేస్తున్నారంటూ ఆ పార్టీ నేతలే ఇడికి ఫిర్యాదు చేశారని ఎద్దేవా చేశారు. ఈసారి ఎన్నికల్లో తమ పార్టీ కచ్చితంగా గెలిచి తీరుతుందనీ, కెసిఆర్ మూడోసారి సిఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వెన్ను చూపి పారిపోయారని వ్యాఖ్యానించారు.